క్లుప్తంగా

హనుమజ్జయంతి ఉత్సవాలు



ముస్తాబైన ఆంజనేయస్వామి ఆలయం

వేంపల్లె : స్థానిక మెయిన్ బజార్‌లోని ఆంజనేయస్వామి ఆలయం హనుమజ్జయంతికి ముస్తాబైంది. మంగళవారం సాయంత్రం రక్షా బంధనం విశ్వేక్షణ ఆరాధన, మహా మంగళ హారతితో ఉత్సవాలు ప్రారంభిస్తామని ఆలయ ఈఓ విశ్వనాథరెడ్డి, అర్చకుడు హరి ప్రవీణ్ తెలిపారు. 22వ తేదీన హనుమాన్ జయంతి పురస్కరించుకుని ఆంజనేయ స్వామిని అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

శ్రీకృష్ణుడు.. ఒక సంపూర్ణ తత్వం

చక్రాయపేట: శ్రీకృష్ణుడు.. ఒక సంపూర్ణ తత్వమని హిందూ జ్ఞానవేదిక పులివెందుల కమిటీ అధ్యక్షుడు వరుణ్‌కుమార్ పేర్కొన్నారు. శ్రీకృష్ణ పరమాత్ముడి అసలైన జ్ఞానాన్ని తెలియజేసేది త్రైత సిద్ధాంత భగవద్గీత మాత్రమేనని అన్నారు. సోమవారం మండలంలోని అద్దాలమర్రి, చెరువుకాంపల్లె, సిద్దారెడ్డిపల్లె, జోగిరెడ్డిపల్లెలో పర్యటిస్తూ త్రైత సిద్ధాంత భగవద్గీత గురించి ప్రచారం చేశారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మల విషయాన్ని శాస్త్రీయంగా తెలుసుకోవడానికి భగవంతుడు అందించిన ఏకైక జ్ఞానమార్గం భగవద్గీతగా పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు కృష్ణవేణి, రామాంజనేయులు, నరసింహ, హరిశివ, వెంకటయ్య పాల్గొన్నారు

ఎంఈఎఫ్ నూతన కమిటీ ఎన్నిక



అధ్యక్షుడు రవీంద్ర

పులివెందుల రూరల్ : పులివెందుల నియోజకవర్గం ఎంఈఎఫ్ (మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్) నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. ఎంఈఎఫ్ గౌరవ అధ్యక్షుడిగా రామకృష్ణ, గౌరవ సలహాదారులుగా గంగన్న, శ్రీనివాసులు, జి.ప్రసాద్ హరిప్రసాద్ ఎంఈఎఫ్ అధ్యక్షుడిగా కె.రవీంద్ర, ఉపాధ్యక్షులుగా కత్తి శ్రీనివాసులు, రామాంజనేయులు, అడవి రాముడు, ఎంఈఎఫ్ ప్రధాన కార్యదర్శిగా చిరంజీవి, సహాయ కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా రాంప్రసాద్ కార్యనిర్వహణ కార్యదర్శులుగా రవీంద్ర, రవిశంకర్, కార్యనిర్వాహక సభ్యులుగా రామాంజనేయులు, వీఆర్ రామాంజనేయులు, బాల నారప్ప, గంగరాజు, గంగాధరను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఎఫ్ అధ్యక్షుడు రవీంద్ర మాట్లాడుతూ తనపై నమ్మకంతో పులివెందుల నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు ఎంఈఎఫ్ రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

ఏడుగురు విద్యార్థులు గైర్హాజరు

వేంపల్లె: పదోతరగతి సప్లమెంటరీ పరీక్షల్లో ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. సోమవారం నుంచి పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. వేంపల్లెలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రెండు పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో సప్లిమెంటరీ తెలుగు పరీక్షకు 31మంది విద్యార్థులు పరీక్షలు రావాల్సి ఉండగా, 24 మంది మాత్రమే హాజరయ్యారు.

రెగ్యులర్ వీసీని నియమించాలి

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన యూనివర్సిటీకి రెగ్యులర్ వైస్ ఛాన్సలర్ లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే రెగ్యులర్ వీసీని నియమించాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ డిమాండ్ చేశారు. సోమవారం కడప నగరం ఓంశాంతి నగర్ లో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైవీయూలో గత కొన్ని నెలలుగా రెగ్యులర్ వైస్ ఛాన్సలర్ లేకపోవడంతో సమస్యలు రోజురోజుకీ పెరిగి పోతున్నాయన్నారు. విక్రమ్ సింహపురి యూనివర్సిటీకి సంబంధించిన రెగ్యులర్ వైస్ ఛాన్సలర్‌గా ఉన్న అల్లం శ్రీనివాసులును ప్రభుత్వం వైవీయూ ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ గా నియమించడం వల్ల కేవలం పది రోజులకు ఒకసారి మాత్రమే యూనివర్సిటీకి వచ్చి వెళ్లిపోతుంటారన్నారు. ఇంత పెద్ద యూనివర్సిటీకి రెగ్యులర్ వీసీ లేకపోవడం బాధాకరమన్నారు.

నీలం సంజీవరెడ్డి సేవలు మరువలేనివి

కడప ఎడ్యుకేషన్: ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించి తొలి ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి నీలం సంజీవరెడ్డి ఎన్నో సేవలందించారని ఆయన సేవలు మరువలేనివని జెకె క్రీడా విద్యా సాంస్కృతిక అభివృద్ధి రాష్ట్ర అధ్యక్షులు లయన్ పటాన్ ఖాదర్‌బాషా అన్నారు. సోమవారం జెకె కార్యాలయంలో నీలం సంజీవరెడ్డి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆర్కే సేవా సమితి అబ్దుల్, కరిముల్లా పాల్గొన్నారు.

కుక్కల బెడద.. నిత్యం వ్యథ

కాలనీలోని కిరాణా షాపునకు వెళ్లాలంటే భయం. రోడ్డుపై నడవాలంటే ఆందోళన. నిత్యం వెళ్లే ప్రాంతమైనా అప్రమత్తంగా ఉండాల్సిందే. రాత్రి వేళ అయితే పరిస్థితి మరింత భయానకం. దీనికి కారణం వీధి కుక్కలే. పులివెందుల పట్టణం, గ్రామాల్లో కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. రోడ్లపై తిరుగుతూ చిన్నపిల్లలు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులను వెంబడించి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వీధి కుక్కల స్వైర విహారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

- దడ పుట్టిస్తున్న వీధి కుక్కలు
- రోడ్లపై గుంపులు గుంపులుగా సంచారం
- వణికిపోతున్న చిన్నారులు, వృద్ధులు



శ్రీరామ హాలు వీధిలో తిరుగుతున్న కుక్కలు



గుంపులు గుంపులుగా సంచరిస్తున్న శునకాలు

పులివెందులరూరల్ : పులివెందుల పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో రోజు రోజుకు శునకాల బెడద ఎక్కువవుతోంది. వీధులలో కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ చిన్న పిల్లలు, వృద్ధులపై దాడికి దిగుతున్నాయి. పట్టణంలోని శ్రీరామ హాలు రోడ్డులోని స్వామి వివేకానంద పాఠశాల వద్ద రాత్రి వేళల్లో కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ ద్విచక్ర వాహనాలలో వెళ్లే వారిని వెంబడిస్తున్నాయి. దీంతో వాహనదారులు కిందపడి గాయాలపాలవుతున్నారు. రోజురోజుకు శునకాల బెడద ఎక్కువ అవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల బెడద నుంచి విముక్తి కలిగించాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం

ఏ కుక్క కరిచినా, అందులోనూ వీధి కుక్కలు అయితే తక్షణమే ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలి. రేబిస్ వ్యాధి సోకితే నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది. వింతగా ప్రవర్తిస్తారు. నీటిని చూస్తే పెద్దగా అరుపులు, కేకలు వేస్తారు. రేబిస్ లక్షణాలు ఉన్న కుక్కలు కరిచినప్పుడు వైరస్ ప్రభావం కేంద్ర నాడీ వ్యవస్థపై పడుతుంది. ముఖం, వెన్నెముక భాగాల్లో కరిస్తే వైరస్ నాడీ వ్యవస్థకు వేగంగా వ్యాపిస్తుంది. కాలు, తొడ, చేయి భాగాలపై కరిచినప్పుడు కొంత ఆలస్యంగా వైరస్ నాడీ వ్యవస్థను చేరుకుంటుంది. రేబిస్ లక్షణాలు బయటపడిన తర్వాత నయం చేయడానికి ఎలాంటి వైద్యం లేదు. రేబిస్ కారక లీసా వైరస్ కుక్కల్లోనే కాకుండా పిల్లులు, నక్కలు, గబ్బిలాల్లోనూ ఉంటుంది. ఏది కరిచినా వెంటనే టీటీ ఇంజక్షన్ చేయించుకోవాలి.

బైక్‌పై వెళ్లాలంటే భయం



కుక్కలు ఎక్కడపడితే అక్కడ గుంపులు గుంపులుగా సంచరిస్తూ ద్విచక్ర వాహనాలలో వెళుతున్న వారిని వెంబడిస్తున్నాయి. దీంతో ఎక్కడ కుక్కలు దాడి చేస్తాయోనని స్పీడ్‌గా వెళ్లే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి.

– సుబ్బరాయుడు, పులివెందుల

చర్యలు తీసుకోవాలి



పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో కుక్కలు ప్రజలపై దాడులు చేస్తున్నాయి. కుక్కల నియంత్రణ చర్యలు చేపట్టడంలో సంబంధిత అధికారులు విఫలమయ్యారు. అధికారులు స్పందించి కుక్కలు బెడద లేకుండా చర్యలు తీసుకోవాలి.

– హనుమంతునాయుడు, వెంకటాపురం

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

వీరపునాయునిపల్లె: మండలంలోని ఉరుటూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న నలసాలమ్మ నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు వేద పండితులు ఉమా మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా ముగిశాయి. ఈ ఆలయ నిర్మాణం గ్రామస్తుల ఆర్థిక సహకారాలతో నిర్మించారు. విగ్రహ ప్రతిష్ట ముగింపు కార్యక్రమాల్లో భాగంగా శివ పార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహించారు.

పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు

ప్రతిష్ట కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా హాజరైన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి, భైరవ ట్రాన్స్‌పోర్ట్ అధినేత మహేంద్రారెడ్డి, పుణ్యభూమి చారిటబుల్ ట్రస్ట్ అధినేత సాయినాథ శర్మ కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరపునాయునిపల్లె మండల కన్వీనర్ రఘునాథరెడ్డి, కమలాపురం మండల అధ్యక్షుడు చెన్నకేశవ రెడ్డి, స్థానిక నాయకులు సుదర్శన్‌రెడ్డి, తిరుమల్ రెడ్డి, రాజుపాలెం జగన్‌రెడ్డి, గంగిరెడ్డి, వెంకటరామిరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, చంద్ర ఓబుల్‌రెడ్డి, వారయ్య యాదవ్, శ్రీనివాసుల్‌రెడ్డి, రంగనాయకులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో నలసాలమ్మ



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి

మొఘల్ చక్రవర్తుల చరిత్ర తొలగించడం తగదు

కడప సెవెన్‌రోడ్స్ : కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ స్టడీస్‌కు సంబంధించిన ఏడో తరగతి సోషల్ సబ్జెక్టులో మొఘల్ చక్రవర్తుల చరిత్ర, ఢిల్లీ సుల్తానుల చరిత్రను పూర్తిగా తొలగించడం తగదని ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ ఆలీఖాన్ ధ్వజమెత్తారు. కడప కలెక్టరేట్‌లో సోమవారం ఆయన కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మయాన రహమతుల్లా ఖాన్, మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమాల్ బాషా తో కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం మొఘలుల చరిత్ర, ఢిల్లీ సుల్తానుల చరిత్రను తొలగించడాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.

నిలిచిపోయిన రోడ్డు పనులు.. ప్రజలకు అవస్థలు

వేంపల్లె : మండలంలో టీడీపీ ఆధిపత్య పోరుతో అలిరెడ్డిపల్లె గ్రామపంచాయతీలోని ఎగువతువ్వపల్లె గ్రామంలో సిమెంట్ రోడ్డు పనులు నిలిచిపోయాయి. దీంతో బుధవారం రాత్రి చిన్నపాటి వర్షానికే రోడ్డుపై వర్షపు నీరు నిలిచి ప్రజలు అవస్థలు పడ్డారు. కొన్నేళ్ల నుండి తువ్వపల్లె గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద వర్షపు నీరు నిల్వ ఉండటంతో సిమెంట్ రోడ్డు వేయాలని టీడీపీ నేతలు ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిని కోరడంతో రూ.10 లక్షలతో రోడ్డుకు నిధులు మంజూరు చేశారు. రోడ్డు పనులు చేసేందుకు కంకరను తోలి సిద్ధం చేశారు. అయితే టీడీపీకి చెందిన మరో వర్గమైన బీటెక్ రవి వర్గానికి చెందిన నేతలు రోడ్డు పనులు జరగకుండా అడ్డుకున్నారు. మూడు రోజులు అలాగే వర్షపు నీరు నిల్వ ఉంటే విపరీతంగా దోమలు వృద్ధి చెంది పిల్లలు, వృద్ధులు రోగాల బారిన పడే అవకాశం ఉందని వారంటున్నారు. పాఠశాల వద్ద సిమెంటు రోడ్డు వేస్తే అ ప్రాంతంలో ఉన్న కొన్ని వీధుల్లోని నీరు బయటకు పోయేందుకు అవకాశం ఉండదని గ్రామ ప్రజలు అంటున్నారు. ఏది ఏమైనప్పటికి టీడీపీ వర్గ పోరుతో అరకొరగా జరుగుతున్న అభివృద్ధి పనులు కూడా కుంటుపడుతున్నాయని ప్రజలు మండిపడుతున్నారు.



పనులు నిలిచిపోవడంతో చిత్తడిగా మారిన రోడ్డు

సృజనాత్మకతకు వేదిక సమ్మర్ క్యాంప్

కడప కల్చరల్ : కడప నగరంలో నిర్వహిస్తున్న జేవీవీ సమ్మర్ క్యాంపు జ్ఞానం, సృజన శీలతలకు ప్రధాన వేదిక కాగలదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా తెలిపారు. సోమవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక ఆర్కే నగర్ లో ఉన్న ఉర్దూ పాఠశాలలో 'వేసవి వినోదం' పేరిట సమ్మర్ క్యాంపును ప్రారంభించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సమీర్ బాష అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి లక్ష్మీరాజా విచ్చేసి మాట్లాడారు. వేసవి వినోదం పేరిట నిర్వహిస్తున్న ఈ శిబిరం బాలల మానసిక స్థితిని వికసింపజేసే సృజనాత్మక వేదికగా నిలుస్తోందన్నారు. ఇలాంటి వేదికలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జేవీవీ నగర అధ్యక్షులు శివరావు మాట్లాడుతూ సమాజంలోని ప్రజల్లో విజ్ఞానాన్ని నింపాలన్న లక్ష్యంతో జనవిజ్ఞాన వేదిక పనిచేస్తుందని తెలిపారు. ఇలాంటి వేసవి శిక్షణా శిబిరాల్లో విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయడంతోపాటు బాలల కళా ప్రతిభను, ఆలోచన సామర్థ్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంచగలవని ఐద్వా అధ్యక్షులు ఐఎన్ సుబ్బమ్మ అన్నారు. ఈ శిక్షణా శిబిరాన్ని జూన్ 5వ తేది వరకు కొనసాగిస్తామన్నారు. శిబిరంలో చిత్రలేఖనం, మ్యాజిక్, సైన్స్, ఓరిగామి, పాటలు, మట్టి బొమ్మల తయారీ రిసోర్స్ పర్సన్ల చేత అవగాహన కలిగించడం తదితరాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, పాఠశాల చైర్ పర్సన్ మహబూబ్ బాషా, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు గపూర్ ,రిసోర్స్ పర్సన్స్ శ్రీనివాసులు రెడ్డి, రంగనాయకులు, కామేశ్వరమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

వేసవి దుక్కులు పంటకు మేలు

తాడిగొట్లలో రైతు సదస్సులో వక్తలు

చింతకొమ్మదిన్నె : తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థులు సోమవారం చింతకొమ్మదిన్నె మండలం తాడిగొట్లలో రైతు సదస్సు- వ్యవసాయ సాంకేతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ కె.అంకయ్య కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అయన మాట్లాడుతూ వ్యవసాయ విద్యార్థులకు మూడు నెలలు శిక్షణ ఇచ్చామని తెలిపారు. సాగులో ఎదురవుతున్న సమస్యలకు పరిష్కరించేందుకు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమం ప్రారంభించామని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఏ వీరయ్య మాట్లాడుతూ ప్రస్తుతం ఋతుపవనాల మార్పుతో తొలకరి వర్షాలు పడడంతో సీజన్ ముందుగానే ప్రారంభమయ్యే అవకాశం ఉందని, రైతులు వేసవి దిక్కులు, విత్తన శుద్ధి, వంటివి చేయడం వలన పురుగులు తెగుళ్ల ఉధృతి తగ్గుతుందని తెలిపారు. సేద్యం నుంచి విత్తనం వరకు శాస్త్రవేత్తల సలహాలు తప్పక పాటించాలని కోరారు. కీటక విభాగ శాస్త్రవేత్త డాక్టర్ జి.ఎస్.పాండురంగ మాట్లాడుతూ విద్యార్థులు, రైతులు వివిధ పంటలలో రసం పీల్చే పురుగులు నివారణకు సలహాలు కోరుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కడప సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్వీ సురేష్ కుమార్ రెడ్డి, బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ, కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త ఏ.వీరయ్య, డాక్టర్ జి.ఎస్ పాండురంగ,కడప ఏడీఏ సురేష్ రెడ్డి, ,గ్రామ సర్పంచ్ సాలమ్మ, వ్యవసాయ కళాశాల విద్యార్థులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



వ్యవసాయ సాంకేతిక ప్రదర్శనను తిలకిస్తున్న వ్యవసాయాధికారులు, రైతులు

కౌన్సిల్‌పై నింద వేసి జీతాలు ఇవ్వకపోవడం సరికాదు

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ కౌన్సిల్ ఆమోదం లేకపోవడం వల్లే మున్సిపల్ కార్మికులకు జీతాలు ఆలస్యం అవుతున్నాయని అధికారులు చెప్పడం సరికాదని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులు అన్నారు. సోమవారం వారు అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రకు వినతి పత్రం సమర్పించారు. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేది నుంచి బడ్జెట్ ఆమోదం లేకపోయినా కోట్ల రూపాయల పనులకు టెండర్లు పిలుస్తున్న నగరపాలక అధికారులు... మున్సిపల్ కార్మికుల జీతాల దగ్గరకు వచ్చేసరికి బడ్జెట్ ఆమోదించలేదని కౌన్సిల్‌పై నెపం వేస్తున్నారన్నారు. అభివృద్ధి పనులకు ఎలాగైతే బడ్జెట్ ఆమోదం లేకుండా టెండర్లు పిలుస్తున్నారో...కార్మికుల జీతాలు కూడా పెండింగ్ లేకుండా ఇవ్వాలని కోరారు. కార్పొరేటర్ కె . బాబు, డివిజన్ ఇన్‌చార్జులు బసవరాజు, పాల్గొన్నారు.

ఎన్నికల విధులకు హాజరు కాని వారిపై చర్యలు వద్దు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా 2024 సాధారణ ఎన్నికల్లో వివిధ అనారోగ్య కారణాలతో విధులకు హాజరు కాలేక పోయిన ఉపాధ్యాయులకు ప్రస్తుతం జరుగుతున్న పదోన్నతి, బదిలీల్లో వారికి అవకాశం కల్పించాలని ఫ్యాప్టో కడప జిల్లా చైర్మన్ ఇలియాస్ బాష, సెక్రటరీ జనరల్ రాళ్లపల్లి అబ్దుల్లా కోరారు. ఈ విషయమై సోమవారం డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను కలిసి ఫ్యాప్టో తరుపున వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంతవరకు గతంలో జరిగిన సాధారణ ఎన్నికలకు కొంతమంది ఉపాధ్యాయులు వ్యక్తిగత, అనారోగ్య కారణాలతోనూ విధులకు హాజరు కాలేని పక్షంలో రిజర్వులో ఉన్న సిబ్బందితో విధులు నిర్వహించేవారన్నారు. అంతేకానీ ఇలా ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ వారిపై బనాయించి అవి పెండింగ్‌లో ఉన్నాయని తెలుపుతూ జరగనున్న పదోన్నతి, బదిలీల్లో అవకాశం లేకుండా చేయడం న్యాయ సమ్మతం కాదన్నారు. వారిపై మానవతా దృక్పథంతో అనారోగ్యంగా, వ్యక్తిగత కారణాలతో ఎన్నికల విధులకు హాజరు కాని ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని కోరారు. ఫ్యాప్టో నాయకులు ఖాదర్ బాషా, నరసింహారావు పాల్గొన్నారు

రాష్ట్రంలో దళితులే లక్ష్యంగా దాడులు

వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

కడప కార్పొరేషన్: రాష్ట్రంలో దళితులను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సింగసాని వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతిలో జేమ్స్ అనే బీటెక్ విద్యార్థిపై అతనికి జూనియర్ అయిన అగ్రకుల విద్యార్థి కులం పేరుతో దూషించి దాడి చేయడం దారుణమన్నారు. అతన్ని ఒక గదిలో నిర్బంధించి చిత్రహింసలు పెట్టడం అనాగరికమన్నారు. తీవ్రగాయాలతో బాధిత విద్యార్థి పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు కేసు నమోదు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎలా ఉన్నాయో చెప్పడానికి ఈ ఘటనే నిదర్శనమన్నారు. దళితులంటే ముఖ్యమంత్రి చంద్రబాబుకే చాలా చిన్నచూపు ఉందని, వారి కార్యకర్తలు, నాయకులు కూడా అదేవిధంగా ప్రవర్తిస్తున్నారన్నారు. దళితులుగా పుట్టాల ని ఎవరైనా కోరుకుంటారా అని దళితుల పట్ల ఆయనకున్న వివక్షను ఏనాడో చెప్పారన్నారు. రాష్ట్రంలో దళితులు, మహిళలపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఎస్సీసెల్ మాజీ అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ మాట్లాడుతూ తిరుపతిలో జేమ్స్ అనే విద్యార్థికి జరిగిన అన్యాయం చూస్తుంటే ఫ్యాక్షన్ సంస్కృతిని గుర్తుకు తెస్తోందన్నారు. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సొంత నియోజకవర్గం పిఠాపురంలో దళితులను గ్రామ బహిష్కరణ చేశారని గుర్తు చేశారు. అనంతపురంలో దళిత మహిళను హత్య చేశారన్నారు. ఇన్ని జరుగుతున్నా చంద్రబాబుగానీ, పవన్ కళ్యాణ్‌గానీ కనీసం స్పందించిన పాపాన పోలేదన్నారు. మాజీ ఎంపీ నందిగం సురేష్ ఇంటిపై దాడి చేసి, దుర్భాషలాడితే పోలీసులు మాజీ ఎంపీపైనే కేసు నమోదు చేసి అరెస్ట్ చేయడం రాష్ట్రంలో అమలవుతున్న రెడ్‌బుక్ పాలనకు నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ నగర అధ్యక్షుడు కంచుపాటి బాబు, త్యాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్. వెంకటేశ్వర్లు

రిమ్స్‌లో వైద్యులకు ప్రత్యేక అవగాహన సదస్సు

కడప అర్బన్: కడపలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్యులకు, అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ వైద్యులకు వేలూరు సీఎంసీ వారి ఆధ్వర్యంలో ట్రైనింగ్ ప్రోగ్రాం బేసిక్ కోసం మెడికల్ ఎడ్యుకేషన్ మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. సోమవారం జ్యోతి ప్రజ్వలన చేసి ఉదయం 9 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై అలుపెరగని పోరాటాలు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రజా వ్యతిరేక విధానాలపై పుచ్చలపల్లి సుందరయ్య అలుపెరగని పోరాటాలు చేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. విలువలు, సిద్ధాంతాలకు కట్టుబడిన నాయకుడు సుందరయ్య అని ప్రశంసించారు. ఎంపీగా గెలిచిన ఆయన పార్లమెంట్‌కు సైకిల్‌పై వెళ్లేవారని, ఇది ఆయన నిరాడంబరతకు నిదర్శనమన్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి, కార్మికుల, పేదల సంక్షేమానికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మనోహర్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి, సీపీఎం కడప నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, నారాయణరెడ్డి, ప్రజానాట్యమండలి నాయకులు నరసింహ, డీవైఎఫ్ఐ కడప నగర కమిటీ కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

చెరువుకు నీరివ్వండి

లింగాల : లింగాల మండలం దొండ్లవాగు గ్రామంలోని చెరువుకు ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని నింపాలని గ్రామానికి చెందిన రైతులు కోరుతున్నారు. 2019–20లో సుమారు రూ.85లక్షల వ్యయంతో పాడా నిధుల ద్వారా ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. పథకం ఏర్పాటు చేసిన తర్వాత 2022, 2023 సంవత్సరాలలో బెలుకు గుంతలకు నీటిని వదిలి అక్కడ నుంచి చెరువుకు నీటిని నింపేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ చెరువుకు నీరు నింపడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ పరిసర ప్రాంతాలలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల పొలాలు ఉన్నాయని, ఆ చెరువుకు నీరు నింపవద్దని కూటమి నాయకులు పీబీసీ అధికారులకు సూచించినట్లు సమాచారం. దీంతో అధికారులు నీరు విడుదల చేయలేదని రైతులు ఆరోపిస్తున్నారు. దీనిపై పీబీసీ డీఈఈ చంద్ర సురేష్‌ను వివరణ కోరగా చెరువుకు నీరు కావాలని అక్కడ నుంచి రైతులు అడగలేదని తెలిపారు. గత రెండు రోజుల క్రితం ఒక రైతు పీబీసీ కార్యాలయంలో అర్జీ ఇచ్చారని, దీనిపై ఈఈతో చర్చించి అనుమతులు తీసుకుని నీటిని విడుదల చేస్తామని ఆయన తెలిపారు.



పీబీసీ కెనాల్‌కు ఏర్పాటు చేసిన దొండ్లవాగు ఎత్తిపోతల పథకం

సుఖీభవ లేక.. దుఃఖం మింగలేక!

- పథకం మంజూరుకు పూర్తి కానీ వెరిఫికేషన్
- సాగుకు అప్పుల కోసం రైతన్న వెతుకులాట

పులివెందుల రూరల్: అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు సంక్షేమానికి పెద్ద పీట వేస్తామని ఆర్భాటంగా హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి నానా తంటాలు పడుతూనే ఉంది. రైతులకు అండగా ఉంటామని ఏ కష్టం రాకుండా ముందస్తు చర్యలు చేపట్టడమే కాకుండా అన్నదాత సుఖీభవ పథకం పేరిట రూ.20వేలు అందిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి 11 నెలలు పూర్తవుతున్నా.. ఇప్పటివరకు రైతు సంక్షేమం కోసం ఏ పథకం అమలు చేయడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక పైసా కూడా రైతులు అకౌంట్లలో జమ కాలేదు. రబీ సీజన్ తుది దశకు చేరుకుంటుంది. ఈ ఏడాది ముందుగానే రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకడంతో వాతావరణ అధికారులు వర్షాలు ముందస్తుగానే వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆడపా దడపా వర్షాలు కురుస్తుండటంతో రైతులు వేసవి దిక్కులు పూర్తిచేసి ఖరీఫ్ సేద్యానికి సన్నద్ధమవుతున్నారు. ఈ సమయంలో పెట్టుబడులకు రైతులు చేతుల్లో డబ్బుల్లేక అప్పులు చేసేందుకు దారులు వెతుకుతున్నారు. ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తుందని నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 25వేల మంది రైతులు ఎదురుచూస్తున్నారు.




ట్రాక్టర్‌తో సేద్యం చేస్తున్న రైతు

జగన్ ప్రభుత్వ హయాంలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వ్యవసాయ సీజన్ ప్రారంభంలోనే మార్గదర్శకాలను అనుసరించి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసేది. రైతులకు అవసరమైన విత్తనాలు ఇవ్వడంతోపాటు పెట్టుబడి సాయం అందించేవారు. కేంద్రం ఇచ్చే రూ.6 వేలకు రాష్ట్ర ప్రభుత్వం వాటా రైతు భరోసా కింద మొత్తం రూ.18వేలు అందించేవారు. ఈ మొత్తం ఖరీఫ్ ప్రారంభానికి ముందే మే నెలలో రైతు ఖాతాకు జమ చేసేవారు. వీటితోపాటు వైఎస్సార్ పంటల బీమా పంట రుణాలకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇలా ప్రతి దశలో రైతులకు జగన్ ప్రభుత్వం అందించేదని రైతులు చెబుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా వేలమంది రైతులు ప్రతి ఏడాది వివిధ పంటలు సాగు చేస్తారు. రైతులకు అండగా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఉండేది. ప్రతి మండలంలో సచివాలయాలకు అనుసంధానంగా రైతు భరోసా కేంద్రాలను నిర్మించారు. ఈ కేంద్రాల ద్వారా విత్తనాలతో పాటు పెట్టుబడి సాయం, రైతు భరోసా నేరుగా రైతు ఖాతాలకు జమ చేసేవారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంతవరకు రైతు ఖాతాల్లో ఒక పైసా కూడా జమ కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం వెంటనే స్పందించాలి



రుతుపవనాలు తొందరగానే రావడంతో రైతులు ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. కానీ రైతుల చేతుల్లో డబ్బులు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి అందించే సహాయం వెంటనే అందించాలని రైతులు కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో మే నెలలోనే ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందేది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక పైసా కూడా రైతులకు ఇవ్వడం లేదు.

– హనుమంతురెడ్డి, రైతు, పులివెందుల

పెట్టుబడి లేక అప్పులు చేస్తున్నాం

ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే చాలా గ్రామీణ ప్రాంతాల్లో పొలాలను దుక్కి దున్ని సిద్ధంగా ఉంచారు. పంటల సాగుకు పెట్టుబడులకు డబ్బుల్లేక బయట ప్రాంతాల్లో అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామాల్లో పథకాలపై సర్వే చేస్తున్నారని అధికారులు చెబుతున్నారు ఎప్పుడు సర్వే చేసి ఎప్పుడు డబ్బులు అందిస్తారో తెలియలేదు. రైతులకు ఇవ్వాల్సిన రైతు భరోసా డబ్బులు వెంటనే రైతులకు అందించాలి.

– కుళ్లాయప్ప, రైతు, పులివెందుల